తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల


వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

శనివారం

07 నవంబర్ 2026

Follow :



పంచాయతీ కార్యదర్శులపై సర్పంచుల ఒత్తిళ్ళు

- ఎంబీలపై సంతకాలు చేయాలంటూ వేధింపులు..
- మాట వినకుంటే ఫిర్యాదులు చేస్తామంటూ బెదిరింపులు?
- కోహిర్ మండలంలో కొన్ని గ్రామాలలో ఇదే పరిస్థితి!

మిగతా 10లో..

కోహిర్, నవంబర్ 5 (జనంసాక్షి):
సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని పలు గ్రామాల్లో కొందరు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిళ్లు తీసుకువస్తూ వారిని మానసిక వేదనకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణ, నిధుల వినియోగం, ఎంబీల (మెజర్‌మెంట్ బుక్స్) నమోదు, బిల్లుల ప్రక్రియ వంటి అంశాల్లో పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి పెరుగుతున్నట్లు సమాచారం.

కొంతమంది సర్పంచులు పనులు పూర్తికాక ముందే ఎంబీలపై సంతకాలు చేయాలని కార్యదర్శులను ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం వ్యవహరిస్తూ, పనుల వివరాలు పరిశీలించకుండా సంతకాలు చేసేందుకు నిరాకరిస్తే తమకు అలాంటి పంచాయతీ కార్యదర్శులు అవసరం లేదంటూ వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది.

మరికొందరు సర్పంచులు తమమాట వినకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని

కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు...



- ఈ నెల 14లోగా పనులన్నీ పూర్తిచేయాలి: ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 6 (జనంసాక్షి):
ఈ నెల 10 నుంచి 25 వరకు నిర్వహించనున్న శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిన్న చింతకుంట మండలం అమ్మాపురంలోని కురుమూర్తి దేవస్థానంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. భక్తుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా పెట్టాలని ఆదేశించారు. మద్యం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తుల రాకపోకల కోసం గత ఏడాది మాదిరిగానే 200 ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

అగ్నిమాపక శాఖ మూడు వాహనాలను సిద్ధంగా ఉంచాలని, ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. అన్ని శాఖలు చేపట్టాల్సిన పనులను ఈ నెల 14లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. 15న స్వామివారి ప్రత్యేక సేవ, 16న ఉద్దాల ఉత్సవం,





17న ఆవాహిత దేవతల పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమష్టి కృషితో ఉత్సవాలను విజయవంతం చేయాలి: కలెక్టర్

కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ గత ఏడాది కంటే ఘనంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని, సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్వో నిర్మల, ఆలయ కమిటీ చైర్మన్ బత్తుల బాలరాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన సెట్విన్ 2వ బ్యాచ్ తుది పరీక్షలు

మక్తల్, నవంబర్ 06 (జనంసాక్షి):
మక్తల్ పట్టణంలోని సెట్విన్ సాంకేతిక శిక్షణా సంస్థ 2వ బ్యాచ్ విద్యార్థులకు శిక్షణ పూర్తి కావడంతో శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన ఎగ్జామినర్ల సమక్షంలో తుది పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అజ్ముద్దీన్ కంప్యూటర్ ట్రైనింగ్, అజ్మత్ ఉన్నీసా జర్దోసీ, శిల్ప ఫ్యాషన్ డిజైనింగ్, అయేషా సుల్తానా బ్యూటీషియన్ కోర్సులకు ఎగ్జామినర్ లుగా వ్యవహరించారు. మొత్తం 222 మంది విద్యార్థులకు ఉదయం రాత పరీక్షలు, మధ్యాహ్నం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. త్వరలో ఫలితాలు వెల్లడించి విద్యార్థులకు సర్టిఫికెట్ లు అందజేస్తామని తెలిపారు. సెట్విన్ కో ఆర్డినేటర్ విజయ్ కుమార్, కంప్యూటర్ ట్రైనర్ తిమ్మప్ప, జర్దోసీ మగ్గం వర్క్ ట్రైనర్ వీరమ్మ, బ్యూటీషియన్ ట్రైనర్ స్వప్న, ఫ్యాషన్ డిజైనింగ్ ట్రైనర్ ఫర్జానా, సిబ్బంది ప్రవీణ్, లక్ష్మీ విద్యార్థినిలు





తదితరులు పాల్గొన్నారు.

ఎల్-నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- వేసవి తాగునీటి అవసరాలకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి: అదనపు కలెక్టర్ పాండు



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 6 (జనంసాక్షి): ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రాబోయే వేసవిలో జిల్లాలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. శుక్ర వారం కలెక్టరేట్‌లో భూగర్భ జలాలు, నీటి వనరుల నిర్వహణ, తాగునీటి సరఫరాపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అందుబాటులో ఉన్న భూగర్భ, ఉపరితల నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లావ్యాప్తంగా తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో పైపులైన్లు, పంపులు, మోటార్ల పనితీరును పరిశీలించి, లీకేజీలు, మరమ్మతులను వెంటనే పరిష్కరించాలన్నారు.

ప్రతి మండలంలో ఇంజినీరింగ్, పంచాయతీ అధికారులు, సర్పంచులు, కార్యదర్శులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి రోజువారీ తనిఖీలు చేయాలని తెలిపారు. నీటి కొరత ఏర్పడే అవకాశమున్న గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ వనరులను సిద్ధం చేసుకోవాలన్నారు.

వ్యవసాయ శాఖ అధికారులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని, వరి సాగును తగ్గించి నీటి పొదుపు పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యేక కార్యాచరణ పనులపై ప్రతి వారం నివేదికలు సమర్పించాలని, ఎల్-నినో పరిస్థితులు ముగిసే వరకు తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి అసమర్థత వల్లే రాష్ట్రంలో కరువు...

• రైతులకు ఎకరానికి రూ.5 వేల తక్షణ సాయం అందించాలి
• కరువును రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: మాజీ మంత్రి హరీశ్ రావు

హత్నూర, నవంబర్ 6 (జనంసాక్షి): రాష్ట్రంలో కరువు అనావృష్టి వల్ల రాలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థత వల్లే ఏర్పడిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి శుక్రవారం హత్నూర మండలంలోని సిరిపురం, దేవునిగుట్ట తండా, తెల్లరాళ్ల తండా, నస్తీపూర్ తదితర గ్రామాల్లో సాగునీరు అందక ఎండిపోయిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టానికి గల కారణాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా నస్తీపూర్ శివారులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి కొట్టుకుపోతున్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. మిల్లర్లపై కేసులు నమోదు చేయడంతో ధాన్యం కొనుగోలుకు వారు వెనుకాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం కరువును కూడా రాజకీయం చేస్తోందని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో కరువు మండలాల ఎంపికలో వివక్ష చూపుతోందని ఆరోపించారు. మెదక్ జిల్లాలోని 21 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నా కేవలం ఒక మండలాన్నే కరువు మండలంగా ప్రకటించడం ఇందుకు నిదర్శనమన్నారు. మరమ్మతుల పేరుతో సింగూరు ప్రాజెక్టు నుంచి 20 టీఎంసీల నీటిని దిగువకు వదిలేయడంతో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. మిగిలిన రెండు టీఎంసీల నీటిని కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు, రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా, పంటల బీమా అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులను ఆదుకునేందుకు మహారాష్ట్ర, కర్ణాటక తరహాలో ఎకరానికి రూ.5 వేల తక్షణ కరువు సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడవేరుగు గ్రామానికి
33 ఎల్ఈడీ లైట్లు అందజేత

• ఎంపీ చామలకు కాంగ్రెస్ నాయకుల కృతజ్ఞతలు



చేర్యాల, నవంబర్ 06 (జనంసాక్షి): గ్రామంలో వీధి దీపాల సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఇందులో భాగంగా శుక్రవారం కడవేరుగు గ్రామపంచాయతీకి 30 వాట్ల సామర్థ్యం కలిగిన 33 ఎల్ఈడీ లైట్లను గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి రమేష్ గుప్త ఆధ్వర్యంలో అందజేశారు. గ్రామంలో విద్యుత్ వెలుగులు మరింత విస్తరించేందుకు సహకరించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తున్న ఎంపీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

వ్యక్తిని గాయపరిచిన కేసులో నిందతుడికి శిక్ష

సంగారెడ్డి, నవంబర్ 6 (జనంసాక్షి): మొక్కజొన్న చేనులో జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై కర్రతో దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడికి న్యాయస్థానం ఏడాది కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే.. 2021లో మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన మాల అంజయ్య తన చేనులో మొక్కజొన్న పంట వేస్తుండగా, అదే గ్రామానికి చెందిన పడమటి అశోక్ రెడ్డి కర్రతో అక్కడికి వచ్చి అతనితో గొడవపడి తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో అంజయ్య గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కొండాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 12/2021 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం న్యాయస్థానంలో విచారణ పూర్తికావడంతో నిందితుడు పడమటి అశోక్ రెడ్డికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ విషయాన్ని మండల ఎస్సై సోమేశ్వరి వెల్లడించారు.

టీజీఎంఎస్ఐడీసీ
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు ఘన సన్మానం



సంగారెడ్డి, అక్టోబర్ 6 (జనంసాక్షి): తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) మెదక్ పరిధిలోని సంగారెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా యు. మహేష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కేంద్ర ఔషధ గిడ్డంగి సీనియర్ ఫార్మసీ అధికారి ఈర్న భాస్కర్ రావు, ఫార్మసీ అధికారి ముబీన్ ఫాతిమా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా అధికారి (డీఈఓ) రమేష్‌తో పాటు ప్యాకర్లు ఉదయ్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

నవంబర్ 8న 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలు

• ప్రతి ఇందిరమ్మ ఇంటి ముందు దీపాలు వెలిగించాలి: హౌసింగ్ పీడీ చలపతిరావు

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 6 (జనంసాక్షి): ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నూతనంగా ఇళ్లు నిర్మించుకున్న పేద కుటుంబాలతో ఈనెల 8న జిల్లా వ్యాప్తంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చలపతిరావు తెలిపారు. లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో కలిసి నూతన గృహాల ముందు దీపాలు వెలిగించి వేడుకల్లో పాల్గొనాలని కోరారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 3,48,977 ఇళ్లకు గాను ఇప్పటివరకు 2,06,982 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 14,445 ఇళ్లు మంజూరు కాగా, 6,617 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 7,828 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 8న నిర్వహించే వేడుకల్లో ప్రతి పూర్తయిన ఇందిరమ్మ ఇంటి ముందు 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' గుర్తుతో పాటు లబ్ధిదారుల వివరాలను గోడలపై రాయించాలని సూచించారు. ఈ ప్రక్రియను నవంబర్ 7లోగా పూర్తి చేయాలన్నారు. వేడుకల రోజున లబ్ధిదారులు ఇంటి ముందు దీపాలు వెలిగించి ఫోటోలు తీసి ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.



ప్రతి గ్రామం, వార్డు నుంచి కనీసం రెండు ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణానికి ముందు, పూర్తయిన తర్వాత తీసిన చిత్రాలతో ప్రదర్శన పలకలు ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకల చిత్రాలను అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలను జతచేస్తూ ప్రచురించాలని తెలిపారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ కుటుంబ సభ్యులతో కలిసి దీపాలు వెలిగించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనాలని చలపతిరావు విజ్ఞప్తి చేశారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన కొమ్మూరి



చేర్యాల, నవంబర్ 6 (జనంసాక్షి): చేర్యాల మండలం దానంపల్లి మాజీ సర్పంచ్ మాదాసు మల్లేశం తండ్రి యాదయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, జనగామ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి యాదయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి తక్షణ సాయంగా రూ.20 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న మల్లేశంకు త్వరలో తగిన గుర్తింపు కల్పిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సదస్సుకు 50 మంది ఆశా కార్యకర్తలు

• ప్రయాణంలో రైతులకు వైద్య సేవలు
• గద్వాల డిఎంఅండ్‌హెచ్ఓ సంధ్యా కిరణ్మయి వెల్లడి



గద్వాల, నవంబర్ 06(జనంసాక్షి): వికారాబాద్ జిల్లా హకీంపేటలో ఈనెల 9వ తేదీ నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న రైతు సదస్సుకు గద్వాల జిల్లా నుండి తరలివెళ్లే రైతన్నల కోసం అధికార యంత్రాంగం పటిష్టమైన వైద్య ఏర్పాట్లు చేస్తోంది. సదస్సుకు హాజరయ్యే రైతులకు ప్రయాణ సమయం నుంచి తిరిగి వచ్చే వరకు ఎలాంటి ఆరోగ్య ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ప్రత్యేకంగా 50 మంది ఆశా కార్యకర్తలను కేటాయించినట్లు గద్వాల జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మయి శుక్రవారం ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించారు. రైతుల రవాణా కోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 50 ప్రత్యేక బస్సులను అధికారులు సిద్ధం చేశారు. ప్రయాణంలో వృద్ధులు, ఇతర రైతులు అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైతే తక్షణ చికిత్స అందించేందుకు వీలుగా ప్రతి బస్సులోనూ ఒక ఆశా కార్యకర్త అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. ఇందుకోసం ఆశా కార్యకర్తలకు అవసరమైన ప్రాథమిక చికిత్స కిట్లు, అత్యవసర మందులను ఓఆర్ఎస్ ప్యాకెట్లను ముందస్తుగానే పంపిణీ చేయనున్నారు. రైతుల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, సుదూర ప్రాంత ప్రయాణంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటారని ఆమె పేర్కొన్నారు. రైతులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

బాణసంచా దుకాణాలకు లైసెన్సు తప్పనిసరి అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

• కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్

కొల్చారం, నవంబర్ 06 (జనంసాక్షి): రానున్న దీపావళి పండుగను పురస్కరించుకొని కొల్చారం మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న దుకాణాలు బాణసంచా (ఫైర్ క్రాకర్స్) దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతులు, లైసెన్సులు పొందాలని కొల్చారం ఎస్సై మహమ్మద్ మొయినుద్దీన్ స్పష్టం చేశారు. అనుమతులు కలిగిన వ్యాపారులు మాత్రమే ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత ప్రదేశాలలో అగ్నిమాపక శాఖ భద్రత ప్రమాణాలను పాటిస్తూ షాపులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే పండుగను ఆసరాగా చేసుకుని బాణసంచాను నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే చట్ట ప్రకారము కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిలువ చేసిన, విక్రయాలు జరిపిన, లేదా అధిక ధరలకు అమ్మితే తమ దృష్టికి వచ్చిన దుకాణాలపై చట్ట ప్రకారము తీవ్రమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.




వ్యాపారులందరూ ఈ విషయాన్ని గమనించి పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారుల నియమ నిబంధనలకు కట్టుబడి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గుండెపోటుతో శివనంపల్లి సర్పంచ్ మృతి

ఇటిక్యాల, నవంబర్ 6 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం శివనంపల్లి సర్పంచ్ గుడిసె లక్ష్మన్న (44) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. పొలంలో పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు ఇటిక్యాల ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.



అడ్డాకుల PACS చైర్మన్‌గా గంగుల విజయమోహన్ రెడ్డి ఏకగ్రీవం



అడ్డాకుల, నవంబర్ 6 (జనంసాక్షి): అడ్డాకుల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) చైర్మన్‌గా సీనియర్ నాయకులు గంగుల విజయ మోహన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అడ్డాకుల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గంగుల విజయ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో ఈ బాధ్యతను అప్పగించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అడ్డాకుల మండల ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, చైర్మన్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

ముకురాలలో తాగునీటి ట్యాంకుల శుభ్రత

- ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ జలధార' కార్యక్రమం





కల్వకుర్తి, నవంబర్ 06(జనంసాక్షి): ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమేలక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'స్వచ్ఛ జలధార' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో తాగునీటి నిల్వ ట్యాంకులను శుభ్రం చేశారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో మూడో విడతలో భాగంగా జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల ద్వారా ట్యాంకుల్లో పేరుకుపోయిన మట్టి, మురికిని తొలగించారు. తాగునీరు కలుషితం కాకుండా, ప్రజలకు ఆరోగ్యకరమైన నీరు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గంలోని మరిన్ని గ్రామాల్లోనూ దశలవారీగా ట్యాంకుల శుభ్రత కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముకురాల ఎల్లయ్య, ఉపసర్పంచ్ కృష్ణవేణి శ్రీను,గ్రామ కార్యదర్శి దీప, ఫౌండేషన్ గ్రామ ప్రతినిధి ప్రతాప్ రెడ్డి,వార్డు సభ్యులు ఎం. సిద్ధయ్య,వి. వెంకటమ్మ, గ్రామ పెద్దలు వెంకట్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కుటుంబ ప్రయోజన
పథకం కింద రూ.20 వేల సాయం



వెల్దండ, నవంబర్ 6 (జనంసాక్షి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి, పోతేపల్లి సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ సూచించారు. గ్రామానికి చెందిన తర్కికంటి లింగమయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబానికి జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 వేల ఆర్థిక సాయం బ్యాంకు ఖాతాలో జమైంది. పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు ఆర్థిక భరోసా కల్పిస్తాయని కొండల్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో వావిళ్ల యాదగిరి, ఎగిరిశెట్టి శివ, మార్కండేయుడు, బాలు యాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆగని ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికుల అవస్థలు

- కల్వకోల్, చెన్నపురావుపల్లి, సాతాపూర్, చంద్రకల్ గ్రామాల ప్రజలకు తప్పని ఇబ్బందులు
- సర్వీస్ రోడ్లపై బస్సులు నిలపాలి.. లేదంటే ఆందోళన తప్పదు
- ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం





పెద్దకొత్తపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి): పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు నిర్ణీత ప్రాంతాల్లో ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కల్వకోల్, చెన్నపురావుపల్లి, సాతాపూర్, చంద్రకల్ గ్రామాల మీదుగా రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు ఆయా గ్రామాల్లోని సర్వీస్ రోడ్లపై నిలపకుండా వెళ్లిపోతుండటంతో స్థానిక ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు.గ్రామాల మీదుగా బస్సులు వెళ్తున్నప్పటికీ ప్రయాణికులను ఎక్కించుకోవడానికి, దిగడానికి నిర్ణీత ప్రాంతాల్లో బస్సులు నిలపడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అత్యవసర పనుల నిమిత్తం మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు బస్సుల కోసం రోడ్ల పక్కన గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

బస్సులు గ్రామాల వద్ద ఆగకపోవడంతో ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోందని, దీనివల్ల అదనపు ఖర్చులతో పాటు సమయం కూడా వృథా అవుతోందని పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో బస్సులు ఆపుతాయనే నమ్మకంతో రోడ్లపై వేచి ఉన్నప్పటికీ, డ్రైవర్లు బస్సులను నిలపకుండా వెళ్లిపోతుండటంతో తీవ్ర నిరాశకు గురవుతున్నామని ప్రయాణికులు చెబుతున్నారు.

ప్రజా రవాణా సౌకర్యాన్ని అందించాల్సిన ఆర్టీసీ అధికారులు ఈ సమస్యపై ఇప్పటివరకు తగిన దృష్టి సారించకపోవడం పట్ల గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల మీదుగా నడిచే బస్సులు ఆయా గ్రామాల్లోని సర్వీస్ రోడ్లపై తప్పనిసరిగా నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో పాటు, దిగాల్సిన వారిని సురక్షితంగా దింపేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత డిపో అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి బస్సు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు.ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి కల్వకోల్, చెన్నపురావుపల్లి, సాతాపూర్, చంద్రకల్ గ్రామాల్లో బస్సులు నిలిపేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్య వైఖరిని వీడకపోతే ఆయా గ్రామాల ప్రజలందరినీ సమీకరించి సంబంధిత ఆర్టీసీ డిపో ఎదుట పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే స్పందించి బస్సుల నిలుపుదల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రైతు సంఘాలతోనే వ్యవసాయ రంగంలో పురోగతి




కోహీర్, నవంబర్ 6 (జనంసాక్షి): వ్యవసాయ రంగంలో రైతులు పురోగతి సాధించాలంటే సంఘాలుగా ఏర్పడాలని జహీరాబాద్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి ఏడీఏ వైద్యనాథ్ సూచించారు. శుక్రవారం కోహీర్ రైతు వేదికలో వివిధ గ్రామాల రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు ఐక్యంగా ఉంటూ పరస్పర సహకారంతో వ్యవసాయ సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. రైతు సంఘాల ద్వారా ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ శాఖ సేవలు, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవచ్చని తెలిపారు. అర్హులైన రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మండలంలో
17 గ్రామాలకు కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం



ఆత్మకూరు, నవంబర్ 6 (జనంసాక్షి): మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాలు, డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి అధ్యక్షతన ఆత్మకూరు మండలంలోని 17 గ్రామాలకు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల ఎంపిక పూర్తయిందని మండల అధ్యక్షుడు ఎన్. నాగేశ్వర్ తెలిపారు. నూతన అధ్యక్షులుగా రేచింతలకు మన్యం రాజు, వీరరాఘవపూర్‌కు హుస్సేన్, తుంపల్లికి కమ్మరి రాములు, కతేపల్లికి కురువ భాషన్న, ఆరేపల్లికి రాజశేఖర్, తిప్పదంపల్లికి సత్తన్న, దేవరపల్లికి గువ్వల ఆంజనేయులు, మోట్లంపల్లికి డోకూరు కురుమన్న, మేడేపల్లికి ఆంజనేయులు గౌడ్, గుంటిపల్లికి కే. రాములు, జూరాలకు మధు, ములమల్లకు కురువ రాజు, పిన్నంచర్లకు కుమ్మరి తిరుపతన్న, బాలకృష్ణపూర్‌కు పెద్ద చాంద్ పాషా, గోపంపేటకు ఖాజమైనద్దీన్, కరువేనా తండాకు ఆనంద్, బోసింగ్ తండాకు సి. రమేష్ ఎంపికయ్యారు. పార్టీ బలోపేతంతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని నాగేశ్వర్ కోరారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి



మక్తల్, నవంబర్ 06 (జనంసాక్షి): వీధిదీపాల సమస్యతో చీకటిలో మగ్గుతున్న బొందలకుంట (నర్సిరెడ్డిపల్లి), సామన్ పల్లి గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు, మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇంచార్జ్ డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి తన స్వంత నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించారు. వారం రోజుల క్రితం ఆయా గ్రామాల సర్పంచులు అశోక్ కుమార్, తిప్పన్న విజ్ఞప్తి మేరకు దీపావళిలోపు లైట్లు వేయిస్తానని ఆయన ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తమ గ్రామాల్లో వెలుగులు నింపిన లక్ష్మికాంత్ రెడ్డి కి సర్పంచులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ హైమాస్ట్ లైట్లను ఈ నెల 07వ తేదీ డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సర్పంచులు తెలిపారు.



విద్యార్థుల విజ్ఞాన యాత్ర ప్రారంభం

కొండపాక, నవంబర్ 6 (జనంసాక్షి): కొండపాక మండలంలోని కుక్కునూరుపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల విద్యా విజ్ఞాన యాత్రను ఎంఈఓ సత్తయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నంగునూరు మండలం నర్మెటలోని ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించారు. పర్యటనలో భాగంగా వివిధ ప్రాంతాల విశేషాలు, చారిత్రక అంశాలు, ప్రకృతి అందాలు, సామాజిక పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

పుస్తక జ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి అనుభవం విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందిస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఇటువంటి యాత్రలు విద్యార్థుల్లో పరిశీలనా శక్తి, సామాజిక అవగాహన, కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తిని పెంచుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మెదక్ ఎంపీకి
వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



రేగోడ్, నవంబర్ 06 (జనంసాక్షి):
మెదక్ పార్లమెంట్ సభ్యులు మాదవనేని రఘునందన్ రావును హైదరాబాదులోని కార్యాలయంలో ఆర్.ఇటిక్యాల గ్రామ బీజేపీ అధ్యక్షుడు శివకుమార్ అన్న కుమార్తె వివాహ వేడుకకు హాజరు కావాలని వివాహ ఆహ్వాన పత్రికను అందజేయడం జరిగింది. ఆహ్వాన పత్రికను స్వీకరించిన ఎంపీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ వివాహ వేడుకకు మండలంలోని కార్యకర్తలందరూ తరలి రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బిజెపి గ్రామ అధ్యక్షుడు శివకుమార్, సీనియర్ నాయకుడు సతీష్ గౌడ్, అనిల్, నాగభూషణం చారి తదితరులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజన నమోదును నవంబర్ నెలలోగా పూర్తి చేయాలి

• జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ బ్యూరో, నవంబర్ 6 (జనంసాక్షి): ఆడపిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు వారి ఉన్నత విద్య, భవిష్యత్తు అవసరాలకు ఆర్థికంగా తోడ్పడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లిలిసుకన్య సమృద్ధి యోజన లిలి పథకం కింద అర్హులైన బాలికలందరికీ ఖాతాలు ప్రారంభించేలా నవంబర్ నెలలో ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గారు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సుకన్య సమృద్ధి యోజన అమలుపై అన్ని సంబంధిత శాఖల అధికారులతో



సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి ఆడపిల్లకు సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రయోజనం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నవంబర్ నెలలోగా అర్హులైన బాలికలందరికీ సుకన్య సమృద్ధి ఖాతాల నమోదు ప్రక్రియను విస్తృత స్థాయిలో చేపట్టి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ఎల్లయ్య,జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గణేశ్వర్, మున్సిపల్ కమిషనర్ నవీన్ విద్యా శాఖ అధికారి రాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ, ఆర్డీవో రమాదేవి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, తదితర అధికారులు పాల్గొన్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు...



కంట్లి, నవంబర్ 6 (జనంసాక్షి): దీపావళి పండుగ పేరుతో పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని కంట్లి సీఐ హెచ్చరించారు. కంట్లి, సిర్గాపూర్, కల్హేర్ మండలాల ప్రజలు పేకాటకు దూరంగా ఉండాలని సూచించారు. పేకాట ఆడేవారితో పాటు నిర్వహణకు స్థలం ఇచ్చే యజమానులపైనా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. పేకాట వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోయి అప్పులపాలవుతున్నాయని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ వెల్లడించారు.

చాకరిమెట్ల

హుండీ రూ.8,15,516ల ఆదాయం



శివ్వంపేట నవంబర్ 6 (జనంసాక్షి): శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులోని స్వయంభూ శ్రీ సహకార ఆంజనేయ స్వామి వారి దేవస్థానానికి చెందిన 7నెలల హుండీని శుక్రవారం దేవాదాయ అధికారులు భక్తుల సమక్షంలో లెక్కించగా రూ. 8,15,516 ల ఆదాయం వచ్చినదని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు, దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ ఆంజనేయ శర్మ, అర్చకులు, శ్రీ లలిత సేవ సంస్థ మహిళ సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చకుండా.. పొలంలోనే కలియదున్నాలి

• రైతులకు అవగాహన కల్పించిన మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ



పెద్ద శంకరంపేట్, నవంబర్ 6 (జనంసాక్షి): వరి కోత అనంతరం మిగిలిన కొయ్యలను కాల్చకుండా పొలంలోనే కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ రైతులకు సూచించారు. శుక్రవారం విరోజిపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వరి కొయ్యలను కాల్చడం వల్ల భూసారం తగ్గడంతో పాటు మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు నశించి పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. కొయ్యలను పొలంలో కలియదున్నడం వల్ల నేలలో తేమ, పోషకాలు పెరిగి భూసారం మెరుగుపడుతుందని, రసాయన ఎరువులు, సాగు ఖర్చులు తగ్గుతాయని వివరించారు. రొటోవేటర్ లేదా డిస్క్ హారోతో కొయ్యలను చిన్న ముక్కలుగా చేసి, నీరు పెట్టి వేస్ట్ డీకంపోజర్ లేదా ట్రైకోడెర్మా విరిడే చల్లితే 15 నుంచి 20 రోజుల్లో సేంద్రియ ఎరువుగా మారుతాయని తెలిపారు. రైతులు పంట అవశేషాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రేవుల కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక పాడి పశువు.. ఎకరా భూమితో సమానం

• పశువుల పోషణ, పెంపకంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

• మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగార్జున పాటిల్

పెద్ద శంకరంపేట్, నవంబర్ 6 (జనంసాక్షి): పాడి పశువుల పోషణ, పెంపకంపై రైతులు ప్రత్యేక శ్రద్ధచూపాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగార్జున పాటిల్ సూచించారు. శుక్రవారం మరిచేట్పల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భస్థ, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎద లక్షణాలను గుర్తించి సరైన సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించాలని, లేగదూడలకు నట్టల నివారణ మందులు, పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు పశుగ్రాస పంటలు సాగు చేయాలని, పాడి పశువుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశం గౌడ్, గోపాలమిత్రులు, రైతులు పాల్గొన్నారు.



రైతుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

కొండపాక నవంబర్ 6 (జనంసాక్షి): కేంద్ర ప్రభుత్వము రైతాంగాని దివాలా తీసే విధంగా కేంద్రంలో చట్టాలు తీసుకు రావడం రైతాంగానికి వ్యతిరేకమని తెచ్చిన నల్ల చట్టాలను పునరుద్ధరించాలనే ఆలోచనలను ఉపసంహరించుకోవాలని లేనిచో రైతాంగం తిరుగుబాటు చేయక తప్పదని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి మూడోరోజు కనకాచారి హెచ్చరించారు. శుక్రవారం రోజున వెలికట్ట చౌరస్తా వద్ద విలేకరులతో మాట్లాడారు.

నలగొండ జిల్లాల్లో జరిగే 36వ రైతు అఖిల భారత కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట గడ్డ నల్లగొండ జిల్లాల్లో అఖిలభారత కిసాన్ సభ 36వ మహాసభలు ఈనెల 15 నుండి 18వ తేదీ వరకు జరుగుతున్నాయి.ఈ మహాసభలకు రైతులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.15వ తేదీన భారీ బహిరంగ సభ లక్షలాదిమందితో ఉంటుందని వారు తెలిపారు.ఇప్పటికే ఎల్ లెని నో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో అనేక మార్పులు వచ్చి రైతులు వేసుకునే పంట చేతికి రాకుండా ఎండీ పోయి తీవ్ర నష్టాల్లో ఉన్నారని ఉమ్మడి కొండపాక మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు నష్టపోయిన రైతు పంటలకు ఎగరకు 50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆహార పంటలకు 25వేల చొప్పున ఎకరాకు పరిహారం ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కరువు మండలాలు ప్రకటించిన వాటికి కేంద్ర ప్రభుత్వం 50 వేల కోట్ల రూపాయలు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భారతదేశంలో రైతాంగం దివాలా తీసే స్థితిలో పాలకులు నెట్టివేయబడుతున్నారని వాటిని కాపాడేటందుకు రైతాంగాన్ని గడ్డ ఎక్కించేటందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలన్నారు. చేపట్టకపోతే రైతాంగంలో సంక్షోభం ఏర్పడి ఆహార ధాన్యాలు కొరత ఏర్పడే ప్రమాదం ఉందని వారు అన్నారు. అతివృష్టి అనావృష్టి వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించడానికి రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని వారు అన్నారు. సిసిఐ ఐకెపి, పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో జరిగే అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడతామని రైతులు పండించే పండ్లు కూరగాయలు పత్తి మిర్చి తదితర పంటలకు గిట్టుబాటు ధర లభించే విధంగా రైతాంగాన్ని చైతన్యం చేసి పోరాటం నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు, పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు, వ్యవసాయానికి సబ్సిడీలను పెంచాలని రైతులను రుణ విముక్తులను చేయాలని తెలంగాణ రైతు సంఘం కోరుతుందన్నారు. కనకచారి తో పాటు రైతు సంఘం మండల నాయకులు అమ్ముల బాల్ నర్సయ్య ఉన్నారు

ఆలయాల్లో

దేవాదాయశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ



చేర్యాల, నవంబర్ 06 (జనంసాక్షి): చేర్యాల మండల పరిధిలోని పలు దేవాలయాలను దేవాదాయ ధర్మాదాయ శాఖ సిద్దిపేట జిల్లా ఇన్స్‌పెక్టర్ విజయలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధూప దీప నైవేద్యం పథకం పరిధిలో ఉన్న దేవాలయాల్లో జరిగే నిత్య కైంకర్యాలు, పూజల తీరును పరిశీలించారు. ప్రతి దేవాలయంలో క్రమం తప్పకుండా నిత్యం పూజలు నిర్వహించాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని ఆలయ పూజారులను హెచ్చరించారు.

వరి ధాన్యం

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అల్లాదుర్గం, నవంబర్ 6 (జనంసాక్షి): అల్లాదుర్గం మండలంలోని సీతానగర్, రాంపూర్, కాయిధంపల్లి, గ్రామాలలో ఐకెపి ఏపీయం రుక్మిణి ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి, సర్పంచి శోభ, సర్పంచి రేణుక, సర్పంచ్ వీరప్ప, సిసి ఇందిరా, సిసి పద్మ, సిసి సాయిలు, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బలరాం, డిసిసి కార్యదర్శి బాలకిషన్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సాయి బాబా ,సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, బేతయ్య, వి.సిద్దు, శ్రీకాంత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేతో

రైతుల భూ హక్కులకు భద్రత

• అదనపు కలెక్టర్ హరిప్రియ



మిడ్జిల్, నవంబర్ 6 (జనంసాక్షి): మండలంలోనీ బైరంపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా పట్టా భూముల రీ సర్వే పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తహసీల్దార్ రాఘవేందర్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం రైతులు, గ్రామస్తులతో మాట్లాడి రీ సర్వే వల్ల భూ రికార్డుల్లో ఖచ్చితత్వం పెరగడంతో పాటు రైతుల భూ హక్కులకు భద్రత కలుగుతుందని వివరించారు.

సర్వేలో మరింత కచ్చితత్వం కోసం జీపీఎస్ ఆధారిత రోవర్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. రీ సర్వే ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు రైతులు, గ్రామస్తులు సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపాల్,తహసీల్దార్ రాఘవేందర్ రెడ్డి, ఉప తహసీల్దార్ రవికాంత్,సర్వేయర్ నరేందర్, జీపీవో, నాయకులు వెంకట శివప్రసాద్, జంగయ్య, రమేష్, బీరయ్య, కడయ, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్..



సదాశివపేట, నవంబర్ 6(జనంసాక్షి):
పేద ప్రజలకు తక్కువ ధరతో నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ యాజమాన్యానికి సూచించారు. శుక్రవారం సదాశివపేటలో నూతనంగా నెలకొల్పిన సురక్ష ఆసుపత్రిని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి యాజమాన్యం నాణ్యమైన వైద్య సేవలతో పాటు పేదలకు అందుబాటు ధరల్లో వైద్యం అందించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ లు పట్లోళ్ల రాజ్ కుమార్, పట్లోళ్ల శిరీష, మాజీ ఎంపీటీసీలు అల్లం లలిత, బండాల, శివకుమార్, నాయకులు పెద్ద గొల్ల ఆంజనేయులు, రవి కుమార్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, పాండురంగరాజు, మన్నే విట్టల్, సిహెచ్ అనిల్, అమరేందర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, మాణిక్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీని సందర్శించిన విద్యార్థులు



శివ్వంపేట, నవంబర్ 6 (జనంసాక్షి):
మల్లారెడ్డి యూనివర్సిటీలో అగ్రికల్చర్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ యొక్క ప్రాజెక్ట్ అయినటువంటి రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం విద్యార్థినీలు శివ్వంపేట గ్రామంలో రైతులు పండించే పంటల సాగు విధానాలు, చీడపీడలు, వాటి యొక్క యాజమాన్య పద్ధతులు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, అలాగే రైతుల అనుభవాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, సర్పంచ్ తో మాట్లాడి పంచాయతీ అధికారం, విధుల గురుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, రైతులు నర్సింలు, లక్ష్మీ నరసయ్య, శ్రీనివాస్, నారాయణలతో పాటు 17 మంది వ్యవసాయ విద్యార్థినీ లు ఉన్నారు.

రైతు సంఘాలతోనే వ్యవసాయ రంగంలో పురోగతి



కోహిర్, నవంబర్ 6 (జనంసాక్షి): రైతులు సంఘాలుగా ఏర్పడి ఐక్యంగా పనిచేస్తేనే వ్యవసాయ రంగంలో పురోగతి సాధ్యమని జహీరాబాద్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి ఏడీఏ వైద్యనాథ్ అన్నారు. శుక్రవారం కోహిర్ రైతు వేదికలో వివిధ గ్రామాల రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు సంఘటితంగా ఏర్పడి వ్యవసాయ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. రైతు సంఘాల ద్వారా ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ శాఖ సేవలు, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.
అర్హులైన రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం: జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు



గద్వాల నడిగడ్డ, నవంబర్ 6(జనంసాక్షి); మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వలన గానీ, మరే విధమైన వేధింపుల వలన గానీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస్ రావు తెలిపారు.
జిల్లాలో మహిళల రక్షణ కోసం షీ టీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థినులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు గురైనా, మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా, బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే నిర్భయంగా షీ టీమ్ పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని అయన తెలిపారు. అక్టోబర్ నెలలో షీటీమ్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 24 అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది అని, మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, వాటిలో ఫొటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 8712670312 ఫోన్ నంబరుకు లేదా డయల్ 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గత నెలకు సంబంధించి షీటీమ్స్ 14, పెట్టి కేసులు నమోదు చేయడం జరిగిందనీ, 14 మంది వ్యక్తులకీ కుటుంబ సభ్యుల ముందు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందనీ, 104 హాట్స్పాట్ నిఘా వుంచగా 14 మంది పోకిరిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని కుటుంబ సభ్యుల ముందు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని అన్నారు. ఒంటరిగా ప్రయాణిస్తున్న వారు T.SAFE APP వినియోగించుకోవాలని, మీ ప్రయాణంలో భరోసా ఇస్తుంది అని తెలిపారు. అమ్మాయిలను ఎలాంటి వేధింపులకు గురి చేసి పట్టుబడితే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తెలిపారు.

చేర్యాల మండలంలో కరువు నివారణ చర్యలు చేపట్టాలి


• **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి**



చేర్యాల, నవంబర్ 6 (జనంసాక్షి):
చేర్యాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నిధులు మంజూరు చేసి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ చేర్యాలకు ఇప్పటివరకు నిధులు కేటాయించలేదని విమర్శించారు. వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 50 వేలు, ఆహార పంటలకు రూ. 25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్ మావో, బండకింది అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్‌ను కలిసిన కోహిర్ కాంగ్రెస్ నాయకులు





కోహిర్, నవంబర్ 6 (జనంసాక్షి):
జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కోహిర్ మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు టి.సువర్ణ మల్లన్న పాటిల్ ఆధ్వర్యంలో సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని రాజకీయ పరిస్థితులు, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, మౌలిక వసతుల కల్పనపై ఎంపీతో చర్చించారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. మండల అభివృద్ధికి ఎంపీ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్లముందే ఎండిన పంట పశువుల మేతగా వరిపంట

• **అన్నదాతకు తీవ్ర నష్టం, ఆందోళనలో రైతులు**



గుండుమాల్, నవంబర్ 6(జనంసాక్షి): మండలంలో కరువు పరిస్థితుల ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి కొరత కారణంగా సాగు చేసిన వరి పంటలు ఎండిపోవడంతో రైతులకు పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొంది. పంట చేతికి వస్తుందన్న ఆశతో సాగు చేసిన వరి పొలాలు ఎండిపోవడంతో చేసేదేమీ లేక రైతులు వాటిని పశువుల మేతగా వదిలేస్తున్నారు. గుండుమాల్ గ్రామానికి చెందిన నర్సింహ రెడ్డి అనే రైతు మూడు ఎకరాలలో వరి పంట సాగు చేయగా ఎల్ నినో ప్రభావంతో కరువు రావడంతో దాదాపుగా ఎకరన్నర పొలంలో వరి ఎండి పోవడంతో పశువులకు మేతగా మారింది. పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులు వృథా కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండుమాల్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతతో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

కడవేర్గులో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు



చేర్యాల, నవంబర్ 06(జనంసాక్షి):
రాబోయే ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం కడవేర్గు గ్రామంలో గ్రాడ్యుయేట్ యువకుల ఓట్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపల్లి రమేష్ గుప్తా, గ్రామ శాఖ అధ్యక్షుడు బాగోతం బాలచంద్రం, యూత్ అధ్యక్షుడు నీరటి విజయ్, కొమరవెల్లి భూషయ్య, పోగుల శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో FLN మిడ్‌లైన్ పరీక్షల పరిశీలన



సిర్గాపూర్, నవంబర్ 6 (జనంసాక్షి): సిర్గాపూర్ మండలంలోని సూర్యానాయక్ తండా, చందర్ నాయక్ తండా ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన FLN మిడ్‌లైన్ పరీక్షలను వాసర్ కాంప్లెక్స్ హెచ్ఎం మంజులాదేవి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదవడం, రాయడం, గణిత సామర్థ్యాలను అంచనా వేశారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థికి ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శరత్ కుమార్ రెడ్డి



అడ్డాకుల, నవంబర్ 6 (జనంసాక్షి): దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు అడ్డాకుల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎం.శరత్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్. లక్ష్మీకాంత్ రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి నాయకత్వంలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో యువతను కలుపుకొని పార్టీ అభివృద్ధికి పనిచేస్తానని తెలిపారు.

సింగూరు మరమ్మతుల్లో జాప్యం వద్దు...

- రైతుల ప్రయోజనాల కోసం సింగూరు పనులు వేగవంతం చేయాలి
- రూ.35 కోట్లతో చేపట్టిన పనులు త్వరగా పూర్తిచేయాలి
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ






సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 6 (జనంసాక్షి): సింగూరు ప్రాజెక్టు ఆయకట్టు మరమ్మతు పనుల్లో జాప్యం వద్దని యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి, ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిల్వలను పునరుద్ధరించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, జిల్లా సహాయ కార్యదర్శి రెహమాన్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి శ్రీమాన్‌తో కలిసి సింగూరు ప్రాజెక్టును సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.

ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు ఆయకట్టు మరమ్మతులు సకాలంలో చేపట్టకపోవడంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముందుగానే మరమ్మతులు చేపట్టి ఉంటే ప్రాజెక్టులో అదనంగా సుమారు 15 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. ఆరు నెలల క్రితమే నీటిని విడుదల చేసి ప్రస్తుతం మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ముందస్తు పరీక్షలే క్యాన్సర్ నివారణకు శ్రీరామరక్ష

- నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం
- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తి నయం సాధ్యం





జడ్చర్ల, నవంబర్ 6 (జనంసాక్షి): దేశవ్యాప్తంగా ప్రతి ఏటా నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం నిర్వహిస్తున్నారు. నోబెల్ గ్రహీత మేరీ క్యూరీ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ఆరోగ్య శాఖ ఈ రోజును ప్రకటించింది. మారిన జీవనశైలి, పొగాకు వాడకం, కాలుష్యం వల్ల క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారు. పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు, మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నట్లు వైద్య వర్గాలు వెల్లడిస్తున్నాయి. వ్యాధి పట్ల అపోహలు తొలగించి, ప్రాథమిక దశలోనే లక్షణాలను గుర్తించేలా చైతన్యం తేవడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశం. అసాధారణ గడ్డలు, దీర్ఘకాలిక దగ్గు, బరువు తగ్గడం, మానని పుండ్లు వంటి సంకేతాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఎర్లీ డిటెక్షన్ ద్వారా క్యాన్సర్‌ను సంపూర్ణంగా నయం చేయవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత స్క్రీనింగ్ సౌకర్యాలు ఉన్నాయని, ప్రజలు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులు...



గద్వాల, నవంబర్ 6(జనంసాక్షి): మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులు, వాహన యజమానులపై కఠినమైన కేసులు నమోదు చేస్తామని గద్వాల సీఐ టి. శ్రీను, టౌన్ ఎస్ఐ ఎం. శ్రీనివాస్ హెచ్చరించారు. మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు వైఎస్ఆర్ చౌక్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించి, మైనర్లు నడుపుతున్న, సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 18 ఏళ్లు నిండిన వారే డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హులని తెలిపారు. మైనర్లకు బైక్‌లు, కార్లు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.

పేటలో సబ్ జూనియర్
బాలుర కబడ్డీ ఎంపికలు



నారాయణపేట నవంబర్ 6(జనంసాక్షి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నారాయణపేటలో సబ్ జూనియర్ బాలుర ఎంపికలు ఘనంగా నిర్వహించినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నారం వెంకట ప్ప తెలిపారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథు లుగా లైన్ హరి నారాయణ బట్టడ్ కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి ఆర్ రెడ్డి, బి నర్సిములు, ట్రెజరర్ కార్తీక్ హాజరై హరి నారాయణ మాట్లాడుతు క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ అధికారి శెట్టి వెంకటేష్, జిల్లా బాధ్యులు సాయినాథ్ పేట టిఎస్ ప్రధాన కార్యదర్శి బాలరాజ్, మౌలానా, రాజశేఖర్, బసంత్ రెడ్డి ఫర్వీన్ బేగం, ఆర్గనైజ్ సెక్రెటరీ అంజిలన్న, నర సింహ,క్రీడాకారులు పాల్గొన్నారు.

పసిడి వర్ణంలో బంతిపూల అందాలు

- పోతంశెట్టిపల్లి-ఏడుపాయల మార్గమధ్యంలో కనువిందు చేస్తున్న బంతిపూల తోట




కొల్చారం, నవంబర్ 06 (జనంసాక్షి): కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి–ఏడుపాయల మార్గమధ్యంలో విరబూసిన పసుపు, నారింజ రంగు బంతిపూలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పచ్చని ఆకుల మధ్య గుండ్రంగా, పసిడి వర్ణంలో వికసించిన బంతిపూలు ఆ ప్రాంతానికి ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చాయి. అటుగా వెళ్లే ప్రయాణికులు పూల అందాలను ఆస్వాదిస్తూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ తోటలో నాణ్యమైన, తాజాగా ఉన్న బంతి పూలు విక్రయానికి అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. పూజలు, దేవాలయాల అలంకరణలు, శుభకార్యాలు, వివాహ వేడుకలకు ఈ పూలు అనుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రకృతి ఒడిలో రంగురంగుల పూల అందాలు ఆహ్లాదాన్ని పంచుతుండటంతో అటుగా వెళ్లేవారి చూపు కాసేపు అక్కడే నిలిచిపోతోంది.

చుంచనకోట గ్రామ కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

చేర్యాల, నవంబర్ 6 (జనంసాక్షి): చేర్యాల మండలం చుంచనకోట గ్రామ కాంగ్రెస్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనగామ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు మంజ మల్లేశం ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా పండుగ మల్లేశం, ఉపాధ్యక్షుడిగా ఎర్రోళ్ల బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా బూడిద నర్సింలు, కోశాధికారిగా గడిపే బిక్షపతి ఎన్నికయ్యారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా బూడిద రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కర్రె రాజు, రైతు విభాగం అధ్యక్షుడిగా ఆది చంద్రమౌళి, మహిళా అధ్యక్షురాలిగా బింగి ఇందిర, యూత్ అధ్యక్షుడిగా బంగారు బానం ఎన్నికయ్యారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మంజ మల్లేశం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూడిద కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ చాటినపేట క్రీడాకారులు



నారాయణపేట నవంబర్ 6 (జనంసాక్షి): మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా స్టేడియంలో నిర్వహించిన అండర్ 14 బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలలో నారాయణపేట క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని జిల్లా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు భువనేశ్వరి 200 మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్ , శివాని 600 మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్,అను హై జంప్ లో సిల్వర్ మెడల్,అనూష డిస్కస్ త్రో లో బ్రాంజ్ మెడల్ , చరణ్ 400 మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్, శివ కుమార్ 600మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్, తరుణ్ షాట్ పుట్ లో గోల్డ్ మెడల్, లక్ష్మి నరసింహ డిస్కస్ త్రోలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ రమణ, పీడీలు శ్రీధర్ గౌడ్, పారిజాత, బీరప్ప, భాను ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌లకు ధరల పట్టిక విడుదల

- ప్రతి మంగళవారం షాపుల బంద్‌కు అసోసియేషన్ నిర్ణయం



తెలకపల్లి, నవంబర్ 06 (జనం సాక్షి): మండల కేంద్రంలో బైక్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైక్ రిపేరింగ్ పనులకు సంబంధించిన ధరల పట్టికను విడుదల చేశారు. మెకానిక్‌లందరికీ ఒకే విధమైన ధరల విధానం అమలులో ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైక్‌ల మరమ్మతులు, సర్వీసింగ్ పనులకు నిర్ణయించిన ధరల ప్రకారమే వినియోగదారులకు సేవలు అందించాలని మెకానిక్‌లకు సూచించారు. ధరల విషయంలో అందరూ ఒకే విధానాన్ని పాటించడం ద్వారా వినియోగదారులకు స్పష్టత ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ప్రతి మంగళవారం బైక్ మెకానిక్ షాపులకు వారాంతపు సెలవుగా నిర్ణయించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని మెకానిక్ షాపులన్నీ ప్రతి మంగళవారం స్వచ్ఛందంగా బంద్ పాటించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సురేష్, రాము, నరేష్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భూములు లేని వారికి రెవెన్యూ నోటీసులా?

- అధికారుల విచారణ తీరుపై బాధితుల ఆగ్రహం


కొల్చారం, నవంబర్ 06 (జనంసాక్షి): మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని ఏడుపాయల ప్రాంతం, ఘనాపూర్ గ్రామ శివారులో రెవెన్యూ అధికారుల నోటీసుల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అసలు భూములే లేని వ్యక్తులకు సైతం రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడంపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత వ్యక్తుల పేర్లపై భూములు ఉన్నాయా? లేవా? అనే కనీస వివరాలను రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించకుండానే నోటీసులు జారీ చేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

క్షేత్రస్థాయి విచారణ చేయకుండానే నోటీసులా?

నోటీసులు జారీ చేసే ముందు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారా? భూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భూములతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులకు నోటీసులు అందడం వెనుక కారణాలేమిటో అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. రెవెన్యూ శాఖలో ఉన్న భూ రికార్డుల ఆధారంగా వాస్తవాలను నిర్ధారించకుండా నోటీసులు జారీ చేయడం అధికారుల విచారణ తీరుపై అనుమానాలకు తావిస్తోంది.

ఉన్నతాధికారులు స్పందించేనా?

అసలు భూములే లేని వారికి నోటీసులు జారీ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? నోటీసుల జారీలో అధికారుల నిర్లక్ష్యం ఉందా? లేక రికార్డుల్లో ఏమైనా పొరపాట్లు జరిగాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఏడుపాయల ఘనాపూర్ శివారు నోటీసుల వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం..
ఆర్వో వాటర్ ప్యూరిఫైర్ అందజేత: కౌన్సిలర్ చరిత



రామాయంపేట, నవంబర్ 6(జనంసాక్షి): రామాయంపేట పట్టణంలోని అశోక్ సింఘాల్ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 5వ వార్డు కౌన్సిలర్ చౌదరి చరిత, కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. గంటకు 100 లీటర్ల శుద్ధి చేసే సామర్థ్యం కలిగిన ఆర్వో వాటర్ ప్యూరిఫైర్‌ను తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసి ప్రారంభించారు.



ఈ సందర్భంగా విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు, సుప్రభాత రావు,పృథ్వీ రావు,వాసవి, మౌనిక, దోమకొండ యాదగిరి, వినయ్ సాగర్, యుగంధర్ రావు, మహేష్,ఎనిశెట్టి రమణ, దారం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- **వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, సాధారణ పంటలకు రూ.35 వేల పరిహారం ఇవ్వాలి**

పెంట్లవెల్లి, నవంబర్ 6 (జనంసాక్షి): పెంట్లవెల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం, కేజీకేఎస్, కేవీపీఎస్ ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఆర్ఐ జానయ్యకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులతో మండలంలోని జూరాల చివరి ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో చేతికొచ్చిన వరి, కంది, మినుము, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వర్షాధార పంటలు సాగు చేసుకునే పరిస్థితి కూడా లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పెంట్లవెల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, వరి తదితర సాధారణ పంటలకు ఎకరాకు రూ.35 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులను గుర్తించి తక్షణమే ఆర్థిక సాయం చేయాలన్నారు. అలాగే రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయాలని, ప్రతి వ్యక్తికి 12 కిలోల బియ్యం అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా గుర్తించి సహాయక చర్యలు చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకొని పెంట్లవెల్లి ప్రాంతాన్ని కరువు మండలంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వం స్పందించకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ జిల్లా కన్వీనర్ ఎల్లగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, ఏదుల ధర్మ రాజు, రెడ్డి రవి, గుట్టల కురుమయ్య, తెలంగాణ రక్షణ సేన నాయకుడు షేక్ షావలి తదితరులు పాల్గొన్నారు.

నీటివృథాకు చెక్..ప్రతి కాలినికి తాగునీటి భరోసా!

- **జూలపల్లిలో మినీ,వాటర్ ట్యాంకుల ప్రారంభం**
- **ప్రతిచుక్క నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి..**
- **జూలపల్లి గ్రామ సర్పంచ్, పద్మమ్మ**

మహమ్మదాబాద్,నవంబర్ 06(జనంసాక్షి): గ్రామంలో తాగునీటి వృథాను అరికట్టడంతో పాటు అన్ని కాలనీలకు తాగునీరు. అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు జూలపల్లి గ్రామ సర్పంచ్ గుండుమల్ల పద్మ నర్సింలు తెలిపారు.ఇందులో భాగంగా గ్రామంలోని సింగిల్ ఫేజ్ మోటార్ల వద్ద నిర్మించిన మినీ వాటర్ ట్యాంకులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మోటార్ల ద్వారా సరఫరా అయ్యే నీరు వృథాగా కాలువల్లోకి వెళ్లకుండా ట్యాంకుల్లో నిల్వచేసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తద్వారా ఇతర కాలిని, ప్రజలకు సైతం నీటిని అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరాలకు వినియోగించుకునే అవకాశం కలుగుతుందన్నారు. తాగునీటి సమస్య ఉన్న కాలనీలకు ఈ మినీ ట్యాంకులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ నీటి విలువను గుర్తించి బాధ్యతగా వ్యవహరించాలని, తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలోని ఇతర మోటార్లకు కూడా అనుసంధానంగా మినీ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి



చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.నీటి సంరక్షణలో గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొత్త నారాయణ, జె.లింగం, బి.శివ, కె.శ్రీధర్, కె.చెన్నమ్మ, ఎం. నరేష్, గ్రామ పెద్దలు జె.బాల్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోహీర్ మెథడిస్ట్
చర్చి నిర్మాణ పనుల పరిశీలన



కోహీర్, నవంబర్ 6 (జనంసాక్షి): కోహీర్‌లో నిర్మాణంలో ఉన్న మెథడిస్ట్ సెంటర్ చర్చి పనులను డిస్ట్రిక్ట్ బిషప్ దయానంద్ పరిశీలించారు. పనుల పురోగతిని సంఘస్తులను అడిగి తెలుసుకున్నారు. చర్చి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు సంఘస్తులందరూ సమష్టిగా కృషి చేసి, తమవంతు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, పాస్టర్లు, డిస్ట్రిక్ట్ లీడర్లు, కౌన్సిలర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాలపై విద్యార్థుల అవగాహన ర్యాలీ



కోహీర్, నవంబర్ 6 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మున్సిపల్ పరిధిలోని ది స్మార్ట్ స్కూల్ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పులపై అవగాహన కల్పించేందుకు గురువారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ హన్నాన్ జావేద్, ప్రిన్సిపాల్ బి. ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు ప్లకార్డులు, నినాదాలతో ప్రజలకు చైతన్యం కల్పించారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం, కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని వివరించారు. వ్యవసాయం, పంటల దిగుబడులు, జలాశయాలు, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. నీటి వృథాను అరికట్టడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత ఇళ్ల స్థలాలను పరిశీలించిన పంచాయతీ కార్యదర్శి




ఖిల్లా ఘనపురం, నవంబర్ 6 (జనంసాక్షి): గ్రామంలోని 11వ వార్డులో పాత ఇళ్ల స్థలాలను పంచాయతీ కార్యదర్శి రవికుమార్ శుక్రవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. కూల్చివేసిన ఇళ్ల స్థలాలను చదును చేసి, మట్టి, శిథిలాలు, చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని యజమానులకు సూచించారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారి మార్గాలు ఏర్పాటు చేసుకోవాలని, పరస్పర సహకారంతో సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. స్థలాలకు సంబంధించిన సమస్యలను పంచాయతీ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అజీమ్, వార్డు సభ్యుడు ప్రతాప్, మాజీ వార్డు సభ్యులు కుమ్మరి రఘు, వెంకటేష్, ఉత్తన్న, ఫిరోజ్ పాల్గొన్నారు.

పశువులకు ఉచిత వైద్య
పరీక్షలు నిర్వహించిన పశు వైద్యశాఖ



నిజాంపేట్, నవంబర్ 06 (జనంసాక్షి): నిజాంపేట్ మండల పరిధిలోని జంబికట గ్రామంలో పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, అవసరమైన మందులు, టీకాలు వేశారు. పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దాణా, పోషకాహారం గురించి రైతులకు, పశుపాలకులకు అవగాహన కల్పించారు. వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్య అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రఘుపతి రెడ్డి , గోపాలమిత్రసూపర్ వైజర్ శ్రీనివాస్ రెడ్డి, గోపాలమిత్రులు పి. మహేశ్వర్ రెడ్డి, పి. ముత్యం గౌడ్, పి. సతీష్ గౌడ్, పశువుల డాక్టర్ నాగర్జున్ పాటిల్ గ్రామ ప్రజలు, రైతులు, పశు పాలకులు పాల్గొన్నారు.

దామరచెరువు పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్



నిజాంపేట్, నవంబర్ 6 (జనంసాక్షి): దామరచెరువు ఎంపీపీఎస్ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. విద్యార్థుల చదువు, హాజరు, క్రమశిక్షణ, పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులతో సమన్వయంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొల్ల సంగమేశ్వర్, ఉపసర్పంచ్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి మౌనికను పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐ
నీరేష్‌ను కలిసిన ప్రెస్ క్లబ్ సభ్యులు



కౌడిపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి): కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్ఐ నీరేష్‌ను రామానంద చటర్జీ ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగరాజు చారి ఆధ్వర్యంలో సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరిస్తామని సభ్యులు పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ వార్తలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు శ్రీశైలం, జమీర్, సైపోద్దిన్, బిక్షపతి, సత్యగౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి...



కృష్ణ, నవంబర్ 6 (జనంసాక్షి): మండలం గుడేబల్లూర్ గ్రామంలో శక్తినగర్ నుండి మక్తల్‌కి వెళుతుండగా, గుడేబల్లూరు గ్రామంలో రోడ్డు పై నిలిచిన ట్రాక్టర్ ను, వెనుక నుండి ఢీకొట్టి దాంతో, ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. కర్ణాటక దేవసూగుర్ లేబర్ కాలోనికి, చెందిన షేక్ సుభాని తండ్రి పేరు నజీర్ వయసు 38, ఈ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నవీద్ తెలిపారు.

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి: చాడ వెంకటరెడ్డి



సిద్దిపేట బ్యూరో, నవంబర్ 6 (జనంసాక్షి): ఓటు చోరీ వ్యవహారంపై కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని ఆనబేరి సింగిరెడ్డి అమర వీరుల భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి, డివిజన్ అధికారి రామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, ఓట్ల తొలగింపుపై బాధ్యత వహించాలని కోరారు. గండిపల్లి, గౌరవెల్లి రిజర్వాయర్లు, కాలువల పనులు త్వరగా పూర్తి చేసి సాగునీరు అందించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. హుస్నాబాద్‌ను కరువు నియోజకవర్గంగా ప్రకటించి, ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునే ఆరుతడి పంటలు సాగు చేయాలి

- **నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన**



కొల్చారం, నవంబర్ 06 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. కొల్చారం మండలంలోని రాంపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ నెల్లి రాజు సంగమేశ్వర్ ఆధ్వర్యంలో కేత్ బచావ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న, కుసుమ, పొద్దుతిరుగుడు, అపరాల వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా రైతులు వర్షాభావ పరిస్థితులను అధిగమించవచ్చని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పచ్చిరొట్ట పంటలు, జీవ ఎరువులు, సూక్ష్మపోషకాలను వినియోగిస్తూ నేల సారాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

మట్టి నమూనాల సేకరణ, పరీక్షల విధానం, వాటి ప్రయోజనాలను వివరిస్తూ నేల పరీక్షల ఆధారంగా సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు. పురుగుమందుల వినియోగానికి ముందు, వినియోగించే సమయంలో, అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట పొలాల్లో పురుగులను గుర్తించి వాటి నివారణకు తగిన మందులను సూచించే నేషనల్ పెస్ట్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు వెంకటరెడ్డి, హొన్నప్పగౌడ, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయశంకర్, మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి, ఉపసర్పంచ్ తంగేళ్ల శ్రీశైలం, వ్యవసాయ విస్తరణ అధికారి నిరోషా, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కోహెడ అభివృద్ధికి బీజేపీ నాయకులు అడ్డుపడటం సరైనది కాదు

- **మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి సుధాకర్**



కోహెడ, నవంబర్ 06 (జనంసాక్షి):

మండల కేంద్రంలో నిన్న జరిగిన 1227 సర్వే నంబర్ భూమి ఆక్రమణకు గురైన భూమిని రెవెన్యూ అధికారులు తొలగింపు చేస్తే అధికారులను,ప్రభుత్వాన్ని తప్పు బట్టిన బీజేపీ నాయకులపై తీవ్రంగా స్పందించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి సుధాకర్.

ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీకి చెందిన 1వ వార్డు మెంబర్ కట్టా ప్రవీణ్‌ను ఈ విషయంలో వెనకుండి ప్రోత్సహిస్తుంది ఎవరని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ ఇప్పటికే వారికి అధికారికంగా నోటీసులు జారీ చేసిందని ఆయన గుర్తుచేశారు. అంతేకాకుండా సర్పంచ్ బండెల సుజాత – బాలకిషన్ పంచాయతీ సెక్రటరీ పలుమార్లు వారికి నచ్చజెప్పి హెచ్చరించినప్పటికీ వారు పెడచెవిన పెట్టారని సుధాకర్ అన్నారు.

బీజేపీ నాయకులు ఈ వ్యవహారంపై పలుమార్లు అధికారులకు 'ప్రజావాణి' కార్యక్రమంలో దరఖాస్తులు కూడా ఇచ్చారని, ఇప్పుడు ఏకంగా గ్రామాభివృద్ధి పనులను పనిగట్టుకుని అడ్డుకుంటున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, ఆ పార్టీ నాయకులు ఉద్దేశపూర్వకంగా అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని మండిపడ్డారు. అలాగే అక్కడే పొన్నాల భూపతికి సంబంధించిన ఈ వ్యవహారంలో రెవెన్యూ, పోలీస్ విభాగాలు వెంటనే జోక్యం చేసుకుని, నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. మన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని, ప్రజా ఆస్తులకు నష్టం కలిగించే ఇటువంటి రాజకీయాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండెల సుజాత- బాలకిషన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బీమ్ రెడ్డి తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ లు దొమ్మాట జగన్ రెడ్డి,జి. లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ బోయిని జయరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్ గౌడ్,వార్డు సభ్యులు చుక్క శంకర్, గజ్జెల ప్రవీణ్, నాయకులు చుక్క అశోక్, వేల్పుల వెంకటస్వామి, మంద వంశీ,తాటిపాముల ప్రవీణ్, గోవింద్ రమేష్, బైరీ శ్రీనివాస్ , వేల్పుల మహేష్ బాబు, శంశీర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



అల్లాదుర్గం, నవంబర్ 6 (జనంసాక్షి): జాతీయ న్యాయ సేవా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అల్లాదుర్గం కోర్టు ఆవరణలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ సేవా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి, కమిటీ చైర్మన్ ఎం. సుచరిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు న్యాయబద్ధమైన మార్గాలను అనుసరించాలన్నారు. ఆర్థిక స్థోమత లేని పేదలకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకొని పరిరక్షించుకోవాలని తెలిపారు. న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, లీగల్ సర్వీసెస్ సిబ్బంది పాల్గొన్నారు.

రుసుంపల్లికి బస్సు సర్వీసును యథావిధిగా పునరుద్ధరించాలి

- **పరిగి డిపో మేనేజర్‌కు బిజెపి రాష్ట్ర నాయకుడు,డాక్టర్ వెన్న ఈశ్వరప్ప,వినతి..**
- **విద్యార్థులు, ఉద్యోగుల ఇబ్బందులు తొలగించాలి..**



మహమ్మదాబాద్, నవంబర్ 06 (జనంసాక్షి):

గండీడ్ మండలం రుసుంపల్లి గ్రామానికి నిలిచిపోయిన బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించి,యథావిధిగా నడపాలని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప కోరారు.శుక్రవారం నాడు పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు కలిసి.వినతిపత్రం అందజేశారు.డిపో మేనేజర్ గారితో మాట్లాడుతూ..రుసుంపల్లి గ్రామానికి గతంలో ఐనాపూర్ నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్లే బస్సు ఉదయం 8:30కి,తిరిగి సాయంత్రం 5:30కి వచ్చి వెళ్లేదని తెలిపారు.అయితే గత ఏడాది కాలంగా బస్సు సర్వీసు నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా పాఠశాలకు కాలేజీకి,వెళ్లే విద్యార్థులు భారీ బ్యాగులను భుజాన వేసుకొని సుమారు మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఉద్యోగులు సైతం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గ్రామ విద్యార్థులు, ఉద్యోగులు,ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని గతంలో మాదిరిగానే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని డిపో మేనేజర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో గండీడ్ మండల మాజీ ఎంపీపీ కొమిరి లక్ష్మయ్య, టెలికాం బోర్డు సభ్యుడు పెంటయ్య గుప్తా,మహమ్మదాబాద్ మండల అధ్యక్షుడు మూస నరసింహులు,గండీడ్ మండల బీజేపీఎం అధ్యక్షుడు చిట్యాల యాదగిరి,మాజీ సర్పంచ్ కాసుల శ్రీనివాస్,తుప్ప విజయ్ కుమార్,జాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్

పెద్దపల్లి పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

- **రూ.25 వేల విలువైన 9 స్టీల్ కుర్చీల అందజేత**



తెలకపల్లి, నవంబర్ 06, (జనంసాక్షి): మండల పరిధిలోని పెద్దపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రూ. 25 వేల విలువైన 9 స్టీల్ కుర్చీలను శుక్రవారం వితరణగా అందజేశారు. అదే పాఠశాలలో పూర్వ విద్యార్థిగా చదువుకున్న ఆనంద్ కుమార్ ద్వారా పాఠశాల కార్యాలయ అవసరాల నిమిత్తం ఈ ఫర్నిచర్‌ను అందించారు. శుక్రవారం ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకరించిన వాసవి క్లబ్ సభ్యులకు, పూర్వ విద్యార్థి ఆనంద్ కుమార్‌కు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ రమేష్, గ్రామ సర్పంచ్ బుగ్గ స్వామి, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, వాసవి క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి

కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం





ఆత్మకూరు, నవంబర్ 6 (జనంసాక్షి): పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని మున్సిపల్ చైర్మన్ జి. నాగమణి అన్నారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంలోని మూడో వార్డులో శుక్రవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్, కౌన్సిలర్ దండు శ్రీనివాసులు, అజ్మతుల్లా, కో-ఆప్షన్ సభ్యుడు సద్దల వెంకట రాములు, కడియాల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు ఈర్లదిన్నె శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ నెల 11న ఎంబీ జీసీ ఎన్నికలు...

- **ఎంబీ.ఫీల్డ్ చైర్మన్ రెవ.ఆర్.పి.జయప్రకాశ్**



రాజోలి, నవంబర్ 6 (జనంసాక్షి): మెన్నోనైట్ బ్రదరన్ చర్చిస్ ఆఫ్ ఇండియా గవర్నింగ్ కౌన్సిల్ ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 11న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంబీ.మిషన్ కాంపౌండ్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాజోలి ఫీల్డ్ అసోసియేషన్ చైర్మన్ రెవ.ఆర్.పి. జయప్రకాశ్ వెల్లడించారు. ప్రస్తుతం ఎం.బి. కాన్ఫరెన్స్‌లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో సంస్థ ఆధ్యాత్మిక, పరిపాలనా వ్యవహారాలను క్రమబద్ధంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎం.బి. కాన్ఫరెన్స్ గవర్నింగ్ కౌన్సిల్‌తో పాటు దాని అనుబంధ శాఖలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పీస్ అండ్ రికన్సిలియేషన్ కమిటీ, ఎం.బి. చర్చిస్ ఆఫ్ ఇండియా కన్వీనర్ రెవ. డాక్టర్ సి.ఎస్. జోయల్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. సంస్థ భవిష్యత్తు కార్యకలాపాలు, ఆధ్యాత్మిక సేవలు, పరిపాలనా బాధ్యతల నిర్వహణకు ఈ ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయని పేర్కొన్నారు. ఈ ఎన్నికలకు ఎం.బి. ఫీల్డ్ డెలిగేట్లు, పాస్టర్లు, సువార్త సేవకులు, సంఘ పెద్దలు, నాయకులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరై తమ భాగస్వామ్యాన్ని తెలియజేయాలని రెవ. ఆర్.పి. జయప్రకాశ్ విజ్ఞప్తి చేశారు.

గిరిజన భవన్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు

- ఏడాది కాలంలో అధునాతన హంగులతో గిరిజన భవనం నిర్మించాలి
- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి





మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 06(జనంసాక్షి): మహబూబ్‌నగర్ నగరంలో గిరిజన భవన్ నిర్మాణానికి ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖ రూ.3 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని నగరంలోని మెట్టుగడ్డ, డైట్ కళాశాల దగ్గర గల స్థలాన్ని ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన భవనం భావితరాలకు ఒక జ్ఞాపకంగా నిలవడంతో పాటు, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు తరతరాలకు అందించేలా నిర్మించాలని అధికారులకు సూచించారు. ఆధునిక హంగులతో, అన్ని అవసరాలకు అనుగుణంగా నూతన గిరిజన భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో గిరిజనులకు సంబంధించిన అన్ని రకాల కార్యక్రమాలు నిర్వహించుకునేలా భవన నిర్మాణం చేపట్టాలని సూచించారు.

ముఖ్యంగా విద్యార్థులు, యువతకు ఉపయోగపడే విధంగా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఏడాది కాలంలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేసి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఆర్.శేఖర్ నాయక్, లింగం నాయక్, లక్ష్మణ్ నాయక్, కె.శేఖర్ నాయక్, చంద్ర నాయక్, కిషన్ నాయక్, శ్రీనివాస్ యాదవ్, అంతిరాం నాయక్, తులసి రాం నాయక్, లోకేష్ , రవి నాయక్, ప్రతాప్ , ఇఇ రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటలను

పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చిన హరీశ్‌రావు, సునీతారెడ్డి

చిలప్‌చేడ్, నవంబర్ 6 (జనంసాక్షి): మండలంలోని సామ్లతాండ, సోమ్మక్కపేట, ఫైజాబాద్, గంగారం గ్రామాల్లో ఎండిపోయిన వరి పంటలను మాజీ మంత్రి హరీశ్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి గురువారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. కరెంటు సక్రమంగా సరఫరా కాక, సాగునీరు అందక చేతికొచ్చిన పంటలు ఎండిపోయాయని రైతులు వారి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కుమార్ అనే రైతు తన ఏడు ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయిందని కన్నీటిపర్యంతమయ్యాడు. వందలాది ఎకరాల్లో పంట నష్టం జరిగి అప్పుల పాలవుతున్నామని రైతులు తెలిపారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనలో రైతులకు 24 గంటల విద్యుత్, రైతుబంధు అందడం లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో నాణ్యమైన విద్యుత్‌తో రెండు పంటలు పండించుకున్న





రైతులు ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి నష్టపరిహారం చెల్లించాలని, పెండింగ్ రైతుబంధు నిధులు విడుదల చేసి, పూర్తిస్థాయి రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రైతులు అధైర్యపడవద్దని, వారి సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి పోరాడుతామని హామీ ఇచ్చారు. మండలంలో సగానికి పైగా పంట నష్టం జరిగిందని రైతులు తెలిపిన నేపథ్యంలో ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించే వరకు ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



పాపన్నపేట, నవంబర్ 6 (జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత నిస్తుందని పాపన్నపేట సర్పంచ్ పావని గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం పాపన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాయిమ్, జీపీవో కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్, ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్, రేషన్ డీలర్లు, వార్డు సభ్యులు రాజు, భూమయ్య తదితరులు ఉన్నారు.


గుమ్మడిదల శ్రీ కల్యాణ రామచంద్ర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి కీలక ముందడుగు

- ఐదు రోజుల్లోగా క్షేత్రస్థాయి పరిశీలన.. సమగ్ర అంచనా వ్యయం సిద్ధం చేయాలని TTD చీఫ్ ఇంజినీర్ ఆదేశం



గుమ్మడిదల, నవంబర్ 6 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలోని శ్రీ కల్యాణ రామచంద్ర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం (TTD) కీలక చర్యలు చేపట్టింది. ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలంటూ దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి సమర్పించిన వినతిపై ఖణ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు TTD చీఫ్ ఇంజినీర్ కార్యాలయం నవంబర్ 5న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ పునర్నిర్మాణ ప్రతిపాదనపై క్షేత్రస్థాయిలో సంయుక్త పరిశీలన నిర్వహించి, సమగ్ర నివేదికతో పాటు నిర్మాణానికి అవసరమైన అంచనా వ్యయాన్ని సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

ఈ పరిశీలన కోసం సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లేదా అసిస్టెంట్ ఇంజినీర్ నేతృత్వంలో బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ బృందంలో స్థపతి లేదా అసిస్టెంట్ స్థపతి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ (HDPP) సిబ్బంది, ఆలయ కమిటీ ప్రతినిధి పాల్గొననున్నారు.



శ్రీవాణి ట్రస్ట్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆలయ ప్రతిపాదనను పరిశీలించి, ఐదు రోజుల్లోగా క్షేత్ర స్థాయి పరిశీలన నివేదికతో పాటు సమగ్ర అంచనా వ్యయాన్ని సమర్పించాలని TTD చీఫ్ ఇంజినీర్ స్పష్టం చేశారు. ఈ పనిని అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఈ మేరకు తిరుమలలోని TTD చీఫ్ ఇంజి నీర్ కార్యాలయంలో జారీ చేసిన అధికారిక లేఖను ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, కిచ్చన్నగారి ప్రకాష్ రెడ్డికి అంద జేశారు.

ఎన్నో ఏళ్లుగా ఆలయ పునర్నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న గుమ్మడిదల గ్రామ ప్రజలు, భక్తులకు TTD నుంచి వచ్చిన ఈ సానుకూల స్పందన కొత్త ఆశలు కల్పించింది. ఆలయ పునర్నిర్మాణ ప్రతిపాదన పరిశీలన దశకు చేరుకోవడంతో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన తదుపరి చర్యలు పూర్తిచేసి శ్రీ కల్యాణ రామచంద్ర స్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

దళిత మహిళలపై

దాడిని ఖండించిన కెవిపిఎస్



రాజోలి, నవంబర్ 6 (జనంసాక్షి): రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ పరిధిలోని అల్మాస్‌గూడ ప్రాంతంలో బైబిల్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఇద్దరు దళిత మహిళలపై భౌతిక దాడికి పాల్పడిన ఘటనను నిరసిస్తూ శుక్రవారం రాజోలి మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద కెవిపిఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ మాట్లాడుతూ..పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే మహిళలపై దాడికి పాల్పడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు విరుద్ధంగా ఇలాంటి దాడులకు పాల్పడటం సరికాదన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో ప్రతి ఒక్కరికీ తమ విశ్వాసాలను అనుసరించే స్వేచ్ఛ ఉందని పేర్కొన్నారు. మహిళలపై ఇలాంటి అమానుష దాడులకు పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజోలి మండల తహసీల్దార్ రామ్మోహన్‌కు కెవిపిఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు గౌండరాజు, ఆనంద్ బాబు, నడిపన్న, సౌలురాజు, కళ్యాణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విమలమ్మ కుటుంబానికి

ఉప్పల వెంకటేష్ ఆర్థిక చేయూత

మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థికసాయం అందజేత



కల్వకుర్తి, నవంబర్06,(జనంసాక్షి): కల్వకుర్తి మండలం గుండూర్ గ్రామానికి చెందిన వంగూరి విమలమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉప్పల వెంకటేష్ వెంటనే స్పందించి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు, గ్రామ సర్పంచ్ అయినేనేని లక్ష్మమ్మ, బీఆర్ఎస్ నాయకులు కృష్ణయ్య, నాగేంద్రం, వార్డు సభ్యులు రాజేందర్, బండి లక్ష్మయ్య, వడ్డే శివ, సైదులు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఆరు మండలాలను

కరువు జాబితాలో చేర్చే వరకు పోరాటం



తెలకపల్లి, నవంబర్ 06, (జనంసాక్షి): కరువు మండలాల ఎంపికలో నాగర్ కర్నూల్ జిల్లా రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రకటించిన కరువు మండలాల జాబితాలో నాగర్ కర్నూల్, తెలకపల్లి, తిమ్మాజిపేట, కొల్లాపూర్, పెంట్లవెల్లి, ఉప్పునుంతల మండలాలకు చోటు కల్పించకపోవడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు మండలాల్లో రైతులు వర్షాభావ పరిస్థితులు, సాగునీటి కొరత, పంట నష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి కరువు మండలాలను ఎంపిక చేయాలని, కార్యాలయ నివేదికల ఆధారంగా రైతులకు అన్యాయం చేయవద్దని అన్నారు. వెంటనే ఆరు మండలాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించి వర్షపాతం, పంటల దిగుబడులు, భూగర్భజలాలు, పంట నష్టాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులు ఉన్నట్లు నిర్ధారణ అయితే వెంటనే ఆయా మండలాలను కరువు జాబితాలో చేర్చి అర్హులైన రైతులకు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని కోరారు. ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఆరు మండలాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సదాశివపేట డిగ్రీ కళాశాలలో ఘనంగా మెగా జాబ్‌మేళా



- 420 మంది హాజరు..191 మందికి ఉద్యోగాలు
- బాలికల హాస్టల్, కంప్యూటర్ ల్యాబ్, ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీ రఘునందన్‌రావు హామీ

సదాశివపేట, నవంబర్ 6(జనంసాక్షి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై జాబ్‌మేళాను ప్రారంభించారు. సుమారు 22 ప్రముఖ కంపెనీలు పాల్గొనగా, 420 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగాల కోసం హాజరయ్యారు. వివిధ దశల్లో నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం 191 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కళాశాలలు జాబ్‌మేళాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి కళాశాల అభివృద్ధికి అవసరమైన బాలికల హాస్టల్, కంప్యూటర్ ల్యాబ్, ప్రహరీ గోడ నిర్మాణ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ బాలికల హాస్టల్ నిర్మాణానికి సీఎస్ఆర్ నిధుల సమీకరణకు కృషి చేస్తానని, కంప్యూటర్ ల్యాబ్‌కు 10 కంప్యూటర్లు అందిస్తానని, ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ హామీలపై ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సిద్ధులు, అధ్యాపకులు సర్వయ్య, స్రవంతి, శకుంతల, మంజుల, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువత తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌పై
చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



జడ్చర్ల, నవంబర్ 6(జనంసాక్షి): మున్సిపల్ విధుల్లో ఉన్న తాగునీటి సరఫరా సిబ్బందిపై అకారణంగా దుర్భాషలాడిన మాజీ కౌన్సిలర్ రమేష్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ వాటర్ సప్లై సిబ్బంది శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఆపరేటర్ మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు.



ఈ నెల 5న మున్సిపల్ ఆఫీస్ ఛాంబర్‌లో అధికారులతో నీటి సరఫరాపై సమీక్ష జరుగుతుండగా రమేష్ అనుమతి లేకుండా వచ్చి కమిషనర్, ఏఈల సమక్షంలోనే తమను అసభ్య పదజాలంతో దూషించారని సిబ్బంది గోనూరి యాదయ్య పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న తమపై అనుచితంగా వ్యవహరించిన ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



వెల్దండ, నవంబర్ 6 (జనంసాక్షి): ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు ఎన్నం శ్రీనివాస్ రెడ్డి కోరారు. తహసీల్దార్ బి. కార్తీక్ కుమార్‌కు గ్రాడ్యుయేట్ ఓటు నమోదు పత్రాలను ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ అందజేశారు. అర్హులందరూ చివరి తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పూరి శివకుమార్, లక్ష్మయ్య, మట్ట విష్ణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ
ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం



ఊర్కొండ, నవంబర్ 6 (జనంసాక్షి): రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ఊర్కొండపేట సర్పంచ్ అబ్దుల్ రషీద్, ఉపసర్పంచ్ రేపని శ్రీనివాస్ గ్రామంలో పర్యటించి లబ్ధిదారుల వివరాలు, ఇంటి స్థలాలను పరిశీలించారు. అర్హులందరికీ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిసిసిబి బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

- బేగంపేటలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు: బ్యాంక్ మేనేజర్ అశ్విని



సంగారెడ్డి, నవంబర్ 6(జనంసాక్షి): డిసిసిబి బ్యాంకు అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ అశ్విని సూచించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని బేగంపేట గ్రామంలో పటాన్‌చెరు డీసీసీబీ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు శాఖ మేనేజర్ అశ్విని మాట్లాడుతూ... ఖాతాదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలతో పాటు వివిధ బ్యాంకింగ్ సేవల గురించి వివరించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అందించే వడ్డీ రేట్లను వివరించారు. సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం, సాధారణ ఖాతాదారులకు 7.75 శాతం వడ్డీ లభిస్తుందని తెలిపారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు శాఖ మేనేజర్ అశ్వినితో పాటు గ్రామ సంస్థ సహాయకులు (వీఓఏలు) పాల్గొన్నారు.

ప్రజాసేవతో ప్రజల మన్ననలు పొందుతున్న భాస్కర్ నాయక్



మిడ్జిల్, నవంబర్ 6 (జనంసాక్షి): పేద ప్రజలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవకుడు జర్పుల భాస్కర్ నాయక్‌కు ప్రజాదరణ పెరుగుతోంది. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆర్థిక, సామాజిక సహాయం అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ఆయన సేవా కార్యక్రమాలకు ఆకర్షితులవుతున్న యువత సైతం మద్దతుగా నిలుస్తున్నారు.

ఈ సందర్భంగా భాస్కర్ నాయక్ మాట్లాడుతూ పదవులు, హోదాల కంటే ప్రజల అభిమానం, ఆశీర్వాదాలే ముఖ్యమని తెలిపారు. పేదల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ప్రస్తుతం ఎలాంటి పదవులు ఆశించకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నానన్నారు. భవిష్యత్తులో ప్రజలు ఆశీర్వదిస్తే రాజకీయాల్లోకి వచ్చి మరింత విస్తృతంగా ప్రజాసేవ చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల మద్దతు ఉన్నంతకాలం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లలో
దీపావళి వెలుగులు నింపుకోవాలి



మహమ్మదాబాద్, నవంబర్ 6 (జనంసాక్షి): ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల నెరవేరిన లబ్ధిదారులు ఈ దీపావళి పండుగను నూతన గృహాల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ పిలుపునిచ్చారు.

శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు కోసం ఎదురుచూస్తున్న పేదలకు ఈ పథకం భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. కొత్త ఇళ్లలో దీపాలు వెలిగించి, కుటుంబ సభ్యులతో కలిసి దీపావళిని ఘనంగా జరుపుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేఎం నారాయణ తెలిపారు.

త్రిపుల్ ఐటీ విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి

- త్రిపుల్ ఐటీని సందర్శించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- అద్దె భవనంలోనే త్రిపుల్ ఐటీ - సొంత భవనం ఇవ్వాలని వినతి
- సోషల్ మీడియాకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టండి: కలెక్టర్

మహబూబ్‌నగర్. బ్యూరో నవంబర్06 (జనంసాక్షి)

బండమీదిపల్లిలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ట్రిపుల్ ఐటీ కళాశాలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినీ, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి విద్యాభ్యాసం, బోధన ప్రమాణాలు, హాస్టల్ వసతి సౌకర్యాలు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించి కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు వేయగా విద్యార్థులు సమాధానాలు ఇచ్చారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, విషయ పరిజ్ఞానాన్ని కలెక్టర్ పరిశీలించారు.

లక్ష్యంతో చదివి శిఖరాలు అధిరోహించాలి - కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక రంగంలో వేగంగా వస్తున్న నూతన మార్పులను అందిపుచ్చుకొని ఆధునిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేసుకొని విలువైన సమయాన్ని విద్యాభ్యాసం, నైపుణ్యాభివృద్ధికి కేటాయించాలని హితవు పలికారు.



సొంత భవనం కావాలి - విద్యార్థుల విజ్ఞప్తి

అనంతరం విద్యార్థులు కళాశాలకు సొంత భవనం లేక అద్దె భవనంలో తరగతులు నిర్వహిస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. కళాశాలకు శాశ్వత భవనం నిర్మించి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రవణ్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఎం.డి. షకీల్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ స్వాతి, ఏవో అర్జున్ కుమార్, ఎస్‌డబ్ల్యూఓ రాముడు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు
హక్కును వినియోగించుకోవాలి

- బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య




వెల్దండ, నవంబర్ 05 (జనంసాక్షి):

పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వెల్దండ మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కానుగుల జోగయ్య కోరారు వెల్దండ మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి. కార్తీక్ కుమార్ కి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు పత్రాలను బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య అందజేశారు.ఈ సందర్భంగా కానుగుల జోగయ్య మాట్లాడుతూ... పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవడం తమ బాధ్యత అని, ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని తెలిపారు. గ్రామంలోని అర్హులైన పట్టభద్రులందరూ ముందుకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.గ్రాడ్యుయేట్ ఓటు నమోదుకు చివరి తేదీ లోపు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ వార్డు నెంబర్ సభ్యులు జంగిలి సునీత ఆనంద్ శేఖర్ పిల్లి దేవేందర్ యువ నాయకులు బర్కం గణేష్ గెల్వాయ్య వెంకటయ్య వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీళ్లు మమ్మల్ని అడగొద్దు

చలికాలంలోనూ మేడ్చల్ సర్కిల్ 60లో తీవ్ర మంచినీటి ఎద్దడి


- ఇంజనీరింగ్ శాఖ అధికారుల నిర్వాకం
- హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులే బాధ్యతంటూ చేతులెత్తేస్తున్న ఇంజనీరింగ్ విభాగం
- డీఈ మేడంతోనే మాట్లాడాలంటున్న ఏఈ మమత
- కనీసం ట్యాంకర్ల ద్వారానైనా అందించాలని స్థానికుల విన్నపం



మేడ్చల్, జనంసాక్షి :
మేడ్చల్ జీహెచ్ఎంసీ సర్కిల్-60 కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఏఈ మమత తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మేడ్చల్ పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విభాగాల్లో మంచినీటి సరఫరా అత్యంత కీలకమైన బాధ్యత. ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నీటి సరఫరాను సమన్వయం చేయడం, కొరత ఏర్పడిన ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవడం, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడం ఇంజినీరింగ్ శాఖ బాధ్యత. అయితే ఈ శాఖలో పనిచేస్తున్న ఏఈ మమత సామాన్య ప్రజలతో దురుసుగా మాట్లాడటమే కాకుండా, వివరాలు కోరిన జర్నలిస్టులకు సైతం సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు ఏమీ తెలియదని, ఏమైనా ఉంటే డీఈతోనే మాట్లాడాలని చెబుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో మేడ్చల్ పట్టణ ప్రజలు 'మమత రూటే సపరేటు' అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఏఈపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మేడ్చల్‌లో తీవ్ర నీటి ఎద్దడి

మేడ్చల్ పట్టణంలో చలికాలంలోనూ తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదుకావడంతో భూగర్భ జలమట్టాలు పడిపోయి బోర్లలో నీటి లభ్యత గణనీయంగా తగ్గింది. దీంతో పట్టణ ప్రజలు పూర్తిగా జీహెచ్ఎంసీ సరఫరా చేసే మంచినీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆరోపిస్తున్నారు. మేడ్చల్ జీహెచ్ఎంసీలో విలీనమైన నేపథ్యంలో హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు నీటి సరఫరా చేయాల్సి ఉండగా, వారు ఇప్పటివరకు సరఫరా బాధ్యతలను పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో సమస్య మరింత జఠిలమైందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంజినీరింగ్ శాఖ అధికారులు తమ బాధ్యతను గుర్తించి నీటి సరఫరాలో లీకేజీలు లేకుండా పర్యవేక్షించడంతో పాటు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఒక వ్యక్తికి రోజుకు సగటున 50 నుంచి 100 లీటర్ల నీరు అవసరమని పేర్కొంటుండగా, మేడ్చల్ జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం కనీస అవసరాలకు తగిన నీరు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మేల్కొని వేసవికాలం రాకముందే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.



2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి
- సంక్షేమ పాలనతో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ
- సన్న బియ్యం పంపిణీతో పేద కుటుంబాలకు ఆహార భద్రత : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సూర్యాపేట(జనంసాక్షి): ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరిపై ఉందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని రవిమహల్ కన్వెన్షన్ హాల్‌లో సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య అధ్యక్షతన జరిగిన సూర్యాపేట జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ కోసం గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పని చేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఇప్పటికే కొంత మందికి న్యాయం జరిగిందని, మిగిలిన వారికి కూడా భవిష్యత్తులో న్యాయం చేస్తామని తెలిపారు.కాంగ్రెస్ శ్రేణులంతా చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేయాలని సూచించారు.పార్టీ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు సాధించలేదని విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలోనూ సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ వరి సాగుకు అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు.ప్రకృతి వైపరీత్యాలు, తక్కువ వర్షపాతం కారణంగా నీటి సమస్య ఏర్పడే పరిస్థితుల్లో ఈ యాసంగి సీజన్ లో వరి సాగు విషయంలో రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.తుంగతుర్తి ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకురావడానికి వెయ్యి కోట్లతో ప్రణాళిక చేపడుతున్నామని తెలిపారు.గతంలో ఎంపీ రఘువీర్ రెడ్డి విజయం కోసం కార్యకర్తలు ఏ విధంగా కృషి చేశారో, అదే స్ఫూర్తితో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు.కార్యకర్తలకు పార్టీ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.సూర్యాపేట జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని చెప్పారు.హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల పనులను త్వరగా పూర్తి చేస్తామని, సూర్యాపేట మీదుగా రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తామని వెల్లడించారు.జిల్లా అభివృద్ధితో పాటు కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, ఎంపీలు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మందుల సామెల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, మాజీ డిసిసి అధ్యక్షుడు, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న,టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, రాష్ట్ర పెరికకుల కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు,ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రీతమ్, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువతరం స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి


జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక



సూర్యాపేట (జనంసాక్షి) : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లాలో యువజనోత్సవాలను శుక్రవారం కలెక్టరేట్ లో నిర్వహించారు.జానపద నృత్యం గ్రూప్, జానపద పాటలు గ్రూప్, పెయింటింగ్, వీధి నాటకం, కవిత్వం పోటీలు నిర్వహించారు.ఈ యువజనోత్సవ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు.యువత విద్యతో పాటు ఇతర రంగాలలో కూడా రాణించాలని అన్నారు.స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోని యువత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ జిల్లా స్థాయి యువజనోత్సవాలలో అన్ని విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి మెమెంటోలు,మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ డి.ప్రేమ్ రాజ్, జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకట్ రెడ్డి, మై భారత్ యూత్ ఆఫీసర్ గౌతమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వెలుగులపై ధరల మంటలు..!

బాణసంచా కొనాలంటే బెంబేలెత్తుతున్న ప్రజలు



- గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగిన టపాసుల ధరలు
- ఇష్టారాజ్యంగా టపాసుల దుకాణాలు
- జాగ్రత్తలు తప్పని సరి అంటున్న వైద్యులు

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 06 (జనంసాక్షి):

దీపావళి పండుగ సమీపిస్తుండటంతో బాణసంచా కొనుగోళ్లకు ప్రజలు సిద్ధమవుతున్నారు. అయితే ఈ ఏడాది టపాసుల ధరలు గణనీయంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే వివిధ రకాల బాణసంచా ధరలు పెరగడంతో కొనుగోలుదారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. పిల్లల ఆనందం కోసం టపాసులు కొనుగోలు చేయాలన్నా జేబుకు చిల్లు పడుతోందని పలువురు వాపోతున్నారు.



దీపావళి సమీపిస్తుండటంతో బాణసంచా వ్యాపారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతోంది. అయితే పండుగ సంబరాల కంటే ప్రమాదాలు ఎక్కువగా భయపెడుతున్నాయి.

అధికారిక అనుమతులు లేకుండానే నిబంధనలు కఠినంగా ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకునే వారు లేరు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్ శాఖల అనుమతులు లేకుండానే వీధి వీధినా బాణసంచా దుకాణాలు పెరిగిపోతున్నాయి. బుధవారం ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా తాత్కాలిక టపాసుల దుకాణాలలో వ్యాపారాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డి తో పాటు పటాన్చెరు, రామచంద్రాపూర్, సదాశివపేట, జహీరాబాద్, జోగిపేట్, నారాయణఖేడ్ తదితర ముఖ్య పట్టణాలలో టపాసుల వ్యాపారం ప్రతి సంవత్సరం జోరుగా కొనసాగుతాయి. టపాసుల ధరలు భారీగా పెరిగినప్పటికీ కొనుగోలుదారులు మాత్రం తగ్గడం లేదు.

పట్టణంలో భారీగా టపాసుల దుకాణాలు.....

సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్, బైపాస్ రోడ్డు, అలాగే పోతిరెడ్డిపల్లి చౌరస్తా, కలెక్టరేట్ సమీపంలో, ఐబి పరిసర ప్రాంతాల్లో, న్యూ బస్టాండ్ సమీపంలో టపాసుల దుకాణాలు వెలిశాయి. అందులో అనుమతులు తీసుకున్న దుకాణాలు కొన్ని అయితే అనుమతులు లేకుండా ఏర్పాటు చేసినవి అధికంగా ఉంటాయి, ఇవి కాకుండా పట్టణంలోని ఆయా కాలనీలలోనీ కిరాణా దుకాణాల సమీపంలో టపాసుల దుకాణాలు కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు. టపాసులు ప్రమాదవశాత్తు పేలి ప్రమాదం సంభవిస్తే బాధ్యులు ఎవరని వారు ప్రశ్నిస్తున్నారు.

కొండెక్కిన టపాసుల ధరలు...

గతేడాది టపాసుల ధరలు అశాజనకంగా ఉండగా... ఈ ఏడాది షాపులు ధరలు భారీగా పెరిగినప్పటికీ టపాసుల డిమాండ్ పెరిగింది. గతేడాది ఫ్లవర్పాట్ చిచ్చుబుడ్డిలు ధర రూ.220 ఉండగా ప్రస్తుతం రూ.310 పలుకుతుంది. 25 షాట్స్ రూ.350 గానూ రూ.430 పలుకుతుంది. 1000 వాలా రూ.190 గానూ రూ.250, లక్ష్మీ ఆవుట్లు రూ.15 గానూ రూ.22, కాకరపూలు రూ.7 గానూ రూ.10, భూ చక్రాలు రూ.60 గానూ రూ.80, మతాబులు రూ.110 గానూ రూ.190, క్యాండిల్స్ రూ.16 గానూ రూ.22 ఈ విధంగా ప్రతిఒక్క టపాసులు ధరలు పెరిగిపోవడంతో కొనుగోలుదారులు కొద్దిపాటి టపాసులు కొనుగోలు చేసి సరిపెట్టుకుంటున్నారు.

జోరందుకున్న బొమ్మల వ్యాపారం...

దీపావళి పర్వదినం పురస్కరించుకొని చాలా ఇళ్లలో బొమ్మల కొలువు కార్యక్రమం నిర్వహిస్తారు. 5 రోజులపాటు నిర్వహించే బొమ్మల కొలువులో లక్ష్మీదేవి ప్రతిమతో పాటు వివిధ రకాల బొమ్మలను ఏర్పాటు చేయడంతో పాటు లక్ష్మీదేవి ప్రతిమను ఉంచి ఐదు రోజులపాటు హారతులు ఇస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మార్కెట్లో వివిధ రకాల బొమ్మలు, లక్ష్మీదేవి ప్రతిమలకు భారీగా వ్యాపారం కొనసాగుతుంది. సంగారెడ్డి పట్టణంలోని వివిధ ప్రాంతాలలో వ్యాపారులు పెద్ద సంఖ్యలో బొమ్మల కొలువుకు సంబంధించిన వాటిని విక్రయిస్తున్నారు. వీటితోపాటు వివిధ రకాల మట్టి ప్రతిమల అమ్మకాలు కూడా పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి.

గుమ్మడికాయలకు భలే గిరాకీ...

దీపావళి పండగ పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా





వివిధ వ్యాపార సముదాయాల్లో ప్రతి సంవత్సరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే వివిధ వాహనాలకు పూజలు నిర్వహిస్తారు. వ్యాపార సముదాయాలు పూజల అనంతరం గుమ్మడికాయ తప్పనిసరిగా దుకాణాల ముందు కొట్టే సాంప్రదాయం కొనసాగుతుంది.

అలాగే షాప్ , ఇండ్ల ముందు బూడిది గుమ్మడికాయ కట్టడం జరుగుతుంది. మార్కెట్లో గుమ్మడికాయల అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ధరలు కూడా అధికంగా ఉండడంతో వ్యాపారులు ఆశ్రమం వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తతోనే అందరి జీవితాల్లో కొత్త వెలుగులు..

దీపావళి చీకట్లను చీల్చుకుంటూ వెలుగులను పంచుతూ అందరికి ఆనందాన్ని కలిగించాలి. దీపావళి సంద ర్భంగా భాణా సంచ కాల్చేవారు. అప్రమత్తంగా ఉండి జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. పెద్ద శబ్దం వచ్చే బాంబులు, భాణాసంచకు దూరంగా ఉండాలి.

బారీ శబ్దాలతో చేవుడు వచ్చే ప్రమాదం కూడ ఉంటుంది. చేవులకు రక్షణ కవచాలు, మూతికి మాస్క్‌లు వాడాలి. పిల్లల విషయంలో ఎమర పాటుగా ఉండరాదు, ముఖ్యంగా గర్భిణీలు, జాగ్రత్తగా ఉండాలి. ఈ దీపావళి ప్రజలందరి జీవితాల్లో కోత్త వెలుగులు తెవాలి..



- డాక్టర్ కృష్ణమూర్తి, సంగారెడ్డి